సాక్షి
ఏలూరు
గురువారం । 30, మార్చి, 2023



మావుళ్లమ్మ సన్నిధిలో..

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని వెస్ట్ బెంగాల్ రైల్వే డీఐజీ బాణా వరుణ్ చంద్రశేఖర్ దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు.



ముగ్గురి అరెస్ట్

తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో ముగ్గురు నిందితులను తణుకు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. 10లో ▸

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ముగిశాయి. 32,824 మంది విద్యార్థులకు 31,689 మంది హాజరయ్యారు. 10లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సహరి (శుక్రవారం తెల్లవారుజాము)
ఏలూరు	6.25	4.38
జంగారెడ్డిగూడెం	6.21	4.39
కైకలూరు	6.23	4.47

న్యూస్‌రీల్

8 నుంచి ట్రిపుల్‌ఐటీలో 'టెక్‌జైట్'



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చాన్సలర్

నూజివీడు: సాంకేతిక ఉత్సవాలు ఇంజినీరింగ్ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. వచ్చేనెల 8 నుంచి 10 వరకు నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహించనున్న సాంకేతిక మహోత్సవం టెక్‌జైట్–2023కి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం వీసీ ఎం.విజయకుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో జరిగే టెక్‌జైట్ ద్వారా విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. దాదాపు 70 ఈవెంట్‌లు, 10 వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. ప్రొఫెసర్లు, పారిశ్రామిక నిపుణులతో చర్చలు కూడా ఉంటాయని, విద్యార్థులు ముందుగా టెక్‌జైట్.ఓఆర్‌జీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అలాగే పూర్వ విద్యార్థుల సమ్మిట్, స్టార్టప్ సమ్మిట్‌లను సైతం నిర్వహించనున్నారు. డైరెక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, డీన్ అకడమిక్ లక్ష్మణరావు, టెక్‌జైట్ కన్వీనర్ కేకే సింగ్ పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు



ఐటీడీఏలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డి.ఆశ అన్నారు. కేఆర్ పురం ఐటీడీఏలో బుధవారం ఏజెన్సీ ప్రాంతంలోని 15 పీహెచ్‌సీల పరిధిలోని వైద్యులు, సూపర్‌వైజర్లతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీల్లో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఉన్నత వైద్యం అందించాలని, మాతాశిశు మరణాల నివారణకు కృషిచేయాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ శిశువులకు నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలని అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజనల్ ఆఫీసర్ ఐ.రాజీవ్, డీపీఎంఓ డాక్టర్ జ్యోతి, డీఎంఓ పీఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగిన క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలు

దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో జేఎన్‌టీయూ (కాకినాడ) సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం 8 జట్ల మధ్య పోటీలు జరిగాయి. వచ్చేనెల 2వ తేదీ వరకు వేగవరంతో పాటు గోపన్నపాలెం వ్యాయామ కళాశాల, ఏలూరు ఆశ్రం కళాశాల మైదానాల్లో క్రికెట్ పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ఏటీఎస్ కరుణానిధి అన్నారు. ఇప్పటివరకూ 46 జట్ల మధ్య పోటీలు పూర్తయ్యాయన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 57 రోజులకు రూ.17,97,055 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ కేవీ గోపాలరావు తెలిపారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి సుధాకర్ పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు బలే నరసింహారావు, ఊడిముడి సుబ్బరాజు, మద్దల సుబ్బలక్ష్మి, శృంగవరప్పాడు ఎంపీటీసీ ఘంటసాల నాగమణి పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లకు దూరం

పదిలో విజయమే లక్ష్యం

- విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా శిక్షణ
- మానసిక నిపుణులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం
- జిల్లాలోని 90 పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ



మెంటల్ హెల్త్ ట్రైనింగ్‌లో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న నిపుణుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో మానసిక ఆందోళనలు, భయాలను పోగొట్టి ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. విద్యార్థులకు సరైన మార్గనిర్దేశనం చేయడం ద్వారా వారిని విజయతీరాలకు చేర్చేలా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నిశాఖల అధికారులను సమాయత్తం చేశారు. విద్యార్థులకు మనోబలాన్ని అందించే దిశగా ప్రతి శాఖలోని అధికారులను, ఉద్యోగులను భాగస్వాములను చేశారు. మానసిక ఒత్తిళ్లను దూరం చేసేలా మెంటల్ హెల్త్ ట్రెనింగ్ ప్రోగ్రాంను రూపొందించి అమలు చేస్తున్నారు.

భాగస్వాములైన నిపుణులు వీరే..

విద్యార్థుల్లో అన్నిరకాల భయాలను పోగొట్టడంతో పాటు ఆత్మనూన్యత భావాలు వీడేలా కొందరు నిపుణులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం కింద డాక్టర్ సీహెచ్ మానస ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారిలో మండల విద్యాశాఖాధికారులు, సీడీపీఓలు, ప్రభుత్వ వైద్యులు, సైకాలజిస్టులు, అధ్యాపకులు, అంటు వ్యాధుల వైద్య నిపుణులు, హాస్టల్ వార్డెన్లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. ఇలా శిక్షణ పొందిన వారు జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 90 పాఠశాలల్లో 9,375 మంది విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం 10వ తరగతి పరీక్షల ప్రారంభం వరకూ కొనసాగించనున్నారు.

ఒత్తిళ్లను తరిమికొడదాం

- నడక ద్వారా మెదడు, మనసులకు ప్రశాంతత చేకూరుతుంది. పార్కులు, తోటల్లో నడవం ద్వారా దాని ప్రభావం మరింత పెరుగుతుంది.
- గట్టిగా ఊపిరి పీల్చి వదలడం ద్వారా ఒత్తిడి నుంచి దూరం కావచ్చు.
- సంతోషకర సంఘటనలు గుర్తు చేసుకోవడం ద్వారా ఒత్తిడిని సులభంగా జయించవచ్చు.
- విహారయాత్ర, భవిష్యత్‌లో వెళ్లాలని ప్లాన్ చేసుకునే ప్రాంతాలను ఊహించుకోవడం ఉత్తమం.
- శాస్త్రీయ సంగీతం వినడం.
- గంట సేపు చదివితే 10 నిమిషాల పాటు విరామం ఇవ్వడం.
- రోజుకు అదనంగా రెండు లీటర్ల వరకు నీటిని తాగడం.
- యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని సులభవంగా దూరం చేయవచ్చని పదో తరగతి విద్యార్థులకు నిపుణులు సూచిస్తున్నారు.

ప్రేరణాత్మక శిక్షణ



పదో తరగతి విద్యార్థుల్లో మానసిక బలహీనతలను గుర్తించి వారిలో ఆత్మవిశ్వాసం నింపడానికి, రెట్టించిన ఉత్సాహంతో పరీక్షలు రాసేలా సన్నద్ధం చేయడానికి ఒత్తిడి నిర్వహణ, ప్రేరణాత్మక శిక్షణ అందిస్తున్నాం. దీని కోసం ఇప్పటికే ఆత్మహత్య నిరోధక విభాగం ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే మానసిక ఆందోళనలు ఉన్న విద్యార్థులను గుర్తించాం. వారిలోని ప్రతికూల వైఖరిని మార్చి సానుకూల దృక్పథం దిశగా వారితో అడుగులు వేయించడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

– వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్, ఏలూరు జిల్లా

వినూత్న ఆలోచన



కలెక్టర్ ఆలోచనతో రూపొందించిన ఈ కార్యక్రమం కొనసాగించడం మా బాధ్యతగా స్వీకరించాం. కలెక్టర్ ఆదేశాలను జిల్లావ్యాప్తంగా అమలు చేయడానికి 90 పాఠశాలలను ఎంపిక చేశాం. ఆయా పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులందరికీ శిక్షణ ఇస్తున్నాం. సైకాలజిస్టులు, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ తదితర శాఖలను భాగస్వాములను చేయడం వినూత్న ఆలోచన. అందరూ సానుకూలంగా స్పందించి విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యతలను అంకితభావంతో స్వీకరించారు.

– ఎస్‌వీ రవిసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలో వచ్చేనెల 3 నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం విశాఖ నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు కలెక్టరేట్ నుంచి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26,217 మంది రెగ్యులర్ విద్యార్థులకు 120 కేంద్రాలు, 3,699 మంది ప్రైవేట్ విద్యార్థులకు 17 కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. వీటిలో ఓపెన్ స్కూల్ పరీక్షలకు 6 సెంటర్లు, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు 11 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. టెన్త్ పరీక్షలకు 1,306 మంది ఇన్విజిలేటర్లు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్స్ సి.సెంటర్ 21 మందిని, కస్టోడియన్స్ 66 మంది, చీఫ్ సూపరింటెండెంట్లు 120 మందిని, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 120 మందిని, అదనపు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 18 మందిని ఏర్పాటుచేశామన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు 160 మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు 17 మందిని, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 17 మందిని, కస్టోడియన్లు 10 మందిని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నలుగురిని ఏర్పాటుచేశామన్నారు. పరీక్షా పత్రాలు భద్రపరిచేందుకు 33 స్టోరేజీ పాయింట్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, డీఎస్పీ పైడేశ్వరరావు, డీఈఓ ఎస్‌వీ రవిసాగర్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎల్.శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి నారాయణస్వామి కన్నుమూత



యర్రా నారాయణ స్వామి (ఫైల్)

సాక్షి, భీమవరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి (బెనర్జీ) (92) బుధవారం తుది శ్వాస విడిచారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఆయన భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఉండి మండలం ఉప్పులూరులో జమిందారీ కుటుంబానికి చెందిన యర్రా సూర్యారావు, శేషాయమ్మ దంపతులకు 1931 ఏప్రిల్ 30న ఆయన జన్మించారు. లక్నో యూనివర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్‌బీ అభ్యసించారు. అప్పటి ఏపీ హైకోర్టు గుంటూరు బెంచ్‌లో కొంతకాలం జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. ఉప్పులూరు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి సొంత నిధులను వెచ్చించారు. అనంతరం ఉండి సహకార రూరల్ బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

వెంగళరావు మంత్రివర్గంలో..

నారాయణస్వామి 1972లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో లఘు పరిశ్రమల శాఖ మంత్రి పదవి పొందారు. 1978లో ఉండి నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. అనంతరం ఎన్టీఆర్ ఆహ్వానంతో తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985లో తాడేపల్లిగూడెం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 1987లో జిల్లాపరిషత్ అధ్యక్షుడిగా విజయం సాధించారు. 1994లో రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. 1999లో మరోమారు ఎమ్మెల్యేగా గెలుపొంది టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. చంద్రబాబు ప్రాధాన్యమివ్వకపోవడంతో కొన్నేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ భీమవరంలో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెంలో విద్యా సంస్థల ఏర్పాటుకు తోడ్పాటు అందించారు. ఆయన భార్య సీతాయమ్మ రెండేళ్ల క్రితం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

నేడు అంత్యక్రియలు

స్వగ్రామం ఉప్పులూరులో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు ఫోన్‌లో కుటుంబసభ్యులను పరామర్శించారు.

మంత్రి కొట్టు దిగ్భ్రాంతి

తాడేపల్లిగూడెం అర్బన్: మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు యర్రా నారాయణస్వామి మృతికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా రాజకీయాల్లో అత్యంత కీలకపాత్ర వహించిన యర్రా లేకపోవడం తీరని లోటన్నారు. అజాత శత్రువుగా, నిరాడంబరుడిగా ఆయన ప్రజల మన్ననలు పొందారన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డ్వాక్రా మహిళలు

ఏలూరు టౌన్: మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రతి అక్కచెల్లెమ్మను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. బుధవారం శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు, నాయకులు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ ఆసరా పథకంలో మహిళలకు మూడో విడత నగదు పంపిణీ చేయటం చాలా సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే 2024 ఎన్నికల్లోనూ మహిళలంతా సీఎం జగన్ వెంటే ఉంటారని వారంతా హామీ ఇచ్చారు. ఆసరా పేరుతో సొమ్ములు జమ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మహిళల సంక్షేమానికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మహిళా పక్షపాతిగా వారిని ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడంతో పాటు రక్షణకు సైతం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ 50 శాతం మహిళలకు కేటాయించారని, చివరకు ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో సైతం ప్రాధాన్యమివ్వడం సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మెప్మా పీడీ ఇమ్మానుయేల్, పి.నాగమణి, సీహెచ్ మహాలక్ష్మి, సురేఖ, కృప, రాజేశ్వరి, మహిళా సమాఖ్య అధ్యక్షులు దాసరి వరలక్ష్మి, అమీనా అన్సారీ, డ్వాక్రా మహిళలు ఉన్నారు.

చిరుధాన్యం.. ఆరోగ్యదాయకం

ఏలూరు (టూటౌన్):చిరుధాన్యాలు ఆరోగ్యదాయకమని, వీటి వాడకాన్ని పెంచాల్సిన అవసరం ఉందని డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సంప్రదాయ చిరుధాన్యాల పోషకాహారాలపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఇండోర్ స్టేడియం నుంచి బుధవారం జిల్లాస్థాయి 2కే రన్ ర్యాలీని ఆర్డీఓ కె.పెంచల కిషోర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. చిరుధాన్యాలపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అవగాహన క్యాంపులు, ర్యాలీలను ఐసీడీఎస్ ద్వారా నిర్వహిస్తోందన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారి కేపీఎల్ పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో పోషణ్ పఖ్వాడా కింద ఈనెల 20 నుంచి వచ్చేనెల 3 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నగరంలో 2కే రన్ నిర్వహించారు. సీడీపీఓలు, పోషణ్ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వట్టికి ఘన నివాళి



వట్టి పార్థసారథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

భీమడోలు: నైతిక విలువలు, విశ్వాసనీయతకు మారుపేరుగా నిలిచిన ఉమ్మడి రాష్ట్రాల మాజీ ఎమ్మెల్సీ వట్టి వెంకట రంగ పార్థసారథి సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురంలోని వట్టి ఇంటి వద్ద బుధవారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కేవీపీ రామచంద్రరావు తదితరులు వట్టి చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. సంస్మరణ సభలో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి చెందిన 50 రోజులకు తండ్రి పార్థసారథి మృతిచెందడం ఉమ్మడి జిల్లాలకు తీరని లోటన్నారు.

కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయలో 2023–24కి 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. వచ్చేనెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 31 నాటికి ఆరేళ్లు నిండి ఎనిమిదేళ్లలోపు ఉన్న పిల్లలు అర్హులన్నారు. 2 నుంచి 7వ తరగతి వరకు ప్రవేశం కోరేవారు వచ్చేనెల 3 నుంచి 12 వరకు విద్యాలయ వెబ్‌సైట్‌లో వివరాలు పొందవచ్చన్నారు.

దాశరథీ కరుణాపయోనిధి

- చారిత్రక క్షేత్రంగా రామునిగట్టు
- చిన భద్రాద్రిగా తూర్పు యడవల్లి
- మానులే దేవతామూర్తులుగా గిరిజనుల సంబరాలు
- శ్రీరామనవమికి ప్రత్యేక ఏర్పాట్లు

చింతలపూడి/బుట్టాయగూడెం: జగదభిరాముడి కల్యాణోత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం యర్రగుంటపల్లి సమీపంలోని (రామునిగట్టుగా ప్రసిద్ధి చెందిన) రామలింగేశ్వరస్వామి ఆలయం, కామవరపుకోట మండలంలోని చినభద్రాద్రిగా పేర్గాంచిన సీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏటా వేలాది మంది ఆయా ఆలయాలను రామనవమి ఉత్సవాల సందర్భంగా సందర్శిస్తారు.

శంఖు చక్రాలతో..

రామునిగట్టు ఆలయంలోని విగ్రహాలు భద్రాద్రిలో విగ్రహాలు మాదిరిగా ఉండటం విశేషం. ఆలయానికి చారిత్రక నేపథ్యం ఉంది. దండకారుణ్యం దక్షిణ భాగాన కొండపై ఉత్తరాభి ముఖంగా స్వామివారు శంఖు, చక్రాలతో వెలిశారని పెద్దలు చెబుతుంటారు. ఇక్కడ స్వామి కల్యాణం జరిపిస్తే వివాహం, సంతాన భాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ ఆలయానికి చేరువలో పరమేశ్వరుడు నందీ సమేతంగా కొండ పైభాగంలో వేంచేసి ఉన్నాడు. పరమశివుడిని శ్రీరాముడు ముళ్ల గోరింట, బొంత పూలతో పూజించినట్టు పురాణాలు చెబుతున్నాయి. ఏటా చైత్రశుద్ధ నవమి రోజు ఇక్కడ స్వామి కల్యాణ్యాన్ని జరిపిస్తారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు దాతల సహకారంతో రూ.25 లక్షలతో నూతన ఆలయాన్ని పునరుద్ధరించారు.

శ్రీవారి దత్తత ఆలయం

తూర్పు యడవల్లిలోని సీతారామస్వామి దేవస్థానం ద్వారకాతిరుమల చినవెంకన్న దత్తత ఆలయం. ఆలయం చినభద్రాద్రిగా పేర్గాంచింది. 2003 జూన్‌లో ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరిగాయి. ఆలయంలో ఆహ్లాదకర వాతావరణం, నిర్మాణ శైలి, బంగారు తాపడంతో ధ్వంజస్తంభం, ఆవరణలోని రాముని విగ్రహాలు, మూలవిరాట్‌కు సమీప భాగాన కుడివైపున స్వామి కల్యాణ మండపం ఆకట్టుకుంటాయి. ఏటా శ్రీరామనవమి నాడు వేకువజామున ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు జరుగుతాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఇక్కడ కూడా భద్రాచలంలో మాదిరిగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలు ఉండటం విశేషం. శ్రీరామనవమికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.



తూర్పు యడవల్లిలోని ఆలయ ప్రాంగణంలో..



యర్రగుంటపల్లి రామునిగట్టుపై విగ్రహాలు

రామునిగట్టును అభివృద్ధి చేయాలి



యర్రగుంటపల్లి (రామునిగట్టు) ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం కూడా ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. ఆలయానికి చెందిన భూములను అప్పగించి ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ఆలయం వద్దకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది.

– వి.సత్యనారాయణ శాస్త్రి, ఆలయ కమిటీ చైర్మన్, యర్రగుంటపల్లి

లక్ష్మీపురంలో వినూత్నంగా..



బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురంలో శ్రీరామనవమి వేడుకలను వినూత్న ఆచారంలో నిర్వహిస్తాం. అడవిలో నాలుగు రకాల చెట్ల మానులను తీసుకువచ్చి విగ్రహాలుగా మలిచి ఏటా పూజలు చేయడం మా ఆనవాయితీ. అదే మాకు జయం, మా గ్రామానికి రక్ష. ఈ సంప్రదాయాన్నే మేం కొనసాగిస్తున్నాం.

– కపిలవాయి హరిసూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం

నాయక్‌పోడు గిరిజనుల ప్రత్యేకం



లక్ష్మీపురంలో పూజలందుకుంటున్న చెట్ల మానులు (ఫైల్)

బుట్టాయగూడెం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో నాలుగు రకాల చెట్ల మానులను అడవి నుంచి తీసుకువచ్చి వాటిని దేవతామూర్తులుగా పూజలు చేస్తారు నాయక్‌పోడు గిరిజనులు. ఏటా శ్రీరామనవమికి గ్రామదేవత గంగానమ్మవారికి పూజలు చేసిన తర్వాత శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడిని పూజిస్తారు. చెట్ల మానులను పూజించడం నాయక్‌పోడు తెగలో తరతరాల ఆచారం. కమిటీ సభ్యులు ముందుగా అడవికి వెళ్లి చెంద్ర, పాల, ఊడిగ, రావి చెట్ల మానులను సేకరిస్తారు. చెంద్ర మానును రాముడిగా, పాల మానును సీతాదేవిగా, ఊడిగ మానును లక్ష్మణుడిగా, రావి మానును ఆంజనేయుడిగా చెక్కించి గ్రామ మధ్యలో ప్రతిష్ఠించి సీతారామ కల్యాణ్యాన్ని ఘనంగా జరిపిస్తారు.

క్లుప్తంగా

గంజాయి బ్యాగుల స్వాధీనం

ముగ్గురు వ్యక్తులు, ఒక బాలుడు అరెస్టు



గంజాయి స్వాధీనం, నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ మూర్తి, ఎస్సై సత్యనారాయణ

పెంటపాడు: అలంపురం హైవే రోడ్డులో 22.500 కేజీల గంజాయి బాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను, ఒక బాలుడిని అరెస్ట్ చేశారు. ఆ వివరాలను తాడేపల్లిగూడెం రూరల్ సీఐ ఎస్వీఎస్ఎస్ మూర్తి పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వెల్లడించారు. ఈనెల 28న మధ్యాహ్నం అలంపురం హైవే రోడ్డులో గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో పెంటపాడు ఎస్సై జి.సత్యనారాయణ, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, సీఐ మూర్తి సిబ్బంది దాడి చేశారు. విశాఖపట్నం జిల్లా రైల్వే గూడ్సు వాగన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి నుంచి కొని అమ్మకానికి తీసుకొస్తున్న రూ.33,750 విలువ గల 22.500 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. నిందితులు మానుకొండ రాజేష్ (చేబ్రోలు) ఇంజమూరి వినయ్ (భీమవరంలోని దుర్గాపురం), మల్లుల వెంకటేశ్వరరావు (గణపవరం మండలం జల్లికాకినాడ)తో పాటు మరో బాలుడుని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్‌ల ఆదేశాల మేరకు నిందితులను కోర్టుకు తరలించనున్నట్టు సీఐ మూర్తి తెలిపారు. దాడికి సహకరించిన పోలీసులు కె.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, ఎం.శివరామకృష్ణలను సీఐ అభినందించారు.

ఆక్వా పార్సిల్ వ్యాన్ బోల్తా



ఉనికిలో బోల్తా కొట్టిన ఆక్వా పార్శిల్ వ్యాన్

మండవల్లి : మండవల్లి మండలంలోని ఇంగిలిపాకలంక గ్రామం నుంచి ఉనికిలి వెళ్తున్న ఆక్వా పార్శిల్ వ్యాన్ బుధవారం ఉనికిలిలోని ఉమ్మడి బద్దల సమీపంలో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఇటీవల గుడివాడ ఆర్టీసీ బస్ తిరగబడిన స్థానంలోనే ఈ వ్యాన్ బోల్తా కొట్టడం విశేషం.



ఏలూరు సెయింట్ థెరిస్సా కళాశాలలో ఇంటర్ పరీక్షలు అయిపోవడంతో ఆనందోత్సాహాల్లో విద్యార్థులు



ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఆఖరి పరీక్షలకు 31,689 మంది హాజరు
- ఏప్రిల్ 4 వరకు బ్రిడ్జి కోర్సు పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలు బుధవారం నాటితో ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు తెలిపారు. బ్రిడ్జి కోర్సు పరీక్షలు ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరుగుతాయని ఆయన అన్నారు. బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలకు మొత్తం 106 కేంద్రాల్లో 32,824 మంది విద్యార్థులకు 31,689 మంది హాజరయ్యారు. విద్యార్థుల హాజరు 97 శాతంగా నమోదయింది. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 11,055 మంది జనరల్ విద్యార్థులకు 10,707 మంది హాజరుకాగా 348 మంది గైర్హాజరయ్యారు. 859 మంది ఒకేషనల్ విద్యార్థులకు 714 మంది హాజరుకాగా 145 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 15,560 మంది జనరల్ విద్యార్థులకు 15,164 మంది హాజరుకాగా 396 మంది గైర్హాజరయ్యారు. 754 మంది ఒకేషనల్ విద్యార్థులకు 668 మంది హాజరు కాగా 86 మంది గైర్హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4,264 మంది జనరల్ విద్యార్థులకు 4,182 మంది హాజరుకాగా 82 మంది గైర్హాజరయ్యారు. 332 ఒకేషనల్ విద్యార్థులకు 254 మంది హాజరుకాగా 78 మంది గైర్హాజరయ్యారు.

వర్జీనియా పొగాకు బేళ్ల వ్యాను స్వాధీనం

కొయ్యలగూడెం: అక్రమంగా తరలిస్తున్న వర్జీనియా పొగాకు బేళ్ల వ్యానును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 28వ తేదీ రాత్రి కొయ్యలగూడెం మండలం సరిపల్లి నుంచి ఓ వ్యక్తి పొగాకు బేళ్లను రవాణా చేస్తుండగా విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు కామవరపుకోట ఆడమిల్లి సమీపంలో తొమ్మిది పొగాకు బేళ్లతో ఉన్న వ్యానును స్వాధీనం చేసుకున్నారు. వ్యానును కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేసి వివరాలు తర్వాత వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న పొగాకు బేళ్ల వ్యాను

కారడవి గ్రామాల్లో జేసీ పర్యటన

పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ల తనిఖీ



లంకపాకల పాఠశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ అరుణ్‌బాబు



అలివేరు - రేగులపాడు రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని మారుమూల దట్టమైన అటవీప్రాంత గ్రామాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.అరుణ్‌బాబు బుధవారం పర్యటించారు. ఎత్తైన కొండలు దాటుకుంటూ ద్విచక్రవాహనంపై ఎంతో సాహసంతో రేగులపాడు, రేపల్లె గ్రామాలను వారు సందర్శించారు. రేగులపాడు పాఠశాలలో కొండరెడ్డి గిరిజనులకు అందుతోన్న సౌకర్యాలపై ఉపాధ్యాయుడు సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. భోజన పథకం అమలుపై ఆరా తీశారు. అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, ఇక్కడ అందిస్తున్న సేవలపై గ్రామస్తులతో మాట్లాడారు. కోడిగుడ్లు అందుతున్నాయా అని ప్రశ్నించగా, కొందరు కొండరెడ్డి గిరిజనులు గుడ్లు తింటే జ్వరం వస్తుందన్నారు. పౌష్టికాహార లోపం లేకుండా ఉండాలంటే తప్పనిసరిగా గుడ్లు తినాలని, అంగన్‌వాడీ కేంద్రంలో అందరికీ గుడ్లు ఇవ్వాలని జేసీ ఆదేశించారు. లంకపాకల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల వివరాలు, గోరుముద్దల పథకంలో భోజనం, రాగిజావ అందించే తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలివేరు నుంచి రేపల్లె వరకు సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులను జేసీ పరిశీలించారు. పనుల్లో నాణ్యతాలోపాల్లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ, ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు, వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర, గిరిజన సంక్షేమ శాఖ డీఈ ఎస్ జొనాతన్, ఆర్ఐ పద్మావతి, సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు కె.గోవిందరాజులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, ఫారెస్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసం కేసులో ముగ్గురి అరెస్టు

- వీరిలో ఇద్దరు మైనర్లు
- రిమాండ్‌కు తరలింపు
- జిల్లా ఎస్పీ రవిప్రకాష్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

తణుకు: తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో ముగ్గురు నిందితులను తణుకు రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వీరిలో అదే గ్రామానికి చెందిన గుమ్మిడి మోహన్‌తోపాటు ఇద్దరు మైనర్లు ఉన్నారు. ఈ మేరకు తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ వివరాలను విలేకర్లకు వెల్లడించారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం తలభాగం తొలగింపుపై పోలీసులు కేసు నమోదు చేసి పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. గుమ్మిడి మోహన్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లు ఈనెల 27న మద్యం తాగి అంబేడ్కర్ విగ్రహం తలభాగాన్ని మాయం చేశారు. విగ్రహం తల భాగం సమీపంలోని చెరువులో పోలీసులు గుర్తించారు. విగ్రహ ఏర్పాటు సమయంలో సైతం వీరు విబేధించినట్టు స్థానికులు చెబుతున్నారు. మరోవైపు గతేడాది సెప్టెంబరులో గ్రామంలో అంబేడ్కర్, సినీ నటుడు పవన్ కల్యాణ్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని పవన్ కల్యాణ్ ఫొటోను అంబేడ్కర్ ఫొటోతోపాటు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొందరు వ్యక్తులు చించివేశారు. దీనిపై గ్రామానికి చెందిన 15 మందిని అనుమానించి పెద్దల సమక్షంలో మందలించి వదిలేశారు. వారిలో ప్రస్తుతం అరెస్టయిన నిందితులు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లను జువైనల్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. కేసులో సహకరించిన నరసాపురం డీఎస్పీ కె.మనోహరాచారి, తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజేయులు, రూరల్ ఎస్సై కె.గుర్రయ్యలను ఎస్పీ రవిప్రకాష్ అభినందించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్‌ప్రకాష్

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు హామీ

తణుకు టౌన్: ముద్దాపురం గ్రామ ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని కమిషన్ తరఫున ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్‌ప్రకాష్ హామీ ఇచ్చారు. బుధవారం ముద్దాపురం హైస్కూల్‌లో దుండగులు ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ ఆందోళన చేస్తోన్న దళిత సంఘాల నాయకులతో మాట్లాడారు. నిందితులను అరెస్ట్ చేశారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేయాలని ఆయన అధికారులను కోరారు. గ్రామంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. దళిత సంఘాల నాయకులతో కలిసి గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో శాంతిభద్రతలను డీఎస్పీ రవి మనోహరాచారి ఆధ్వర్యంలో సీఐలు సీహెచ్ ఆంజనేయులు, ముత్యాల సత్యనారాయణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సర్పంచ్ మజ్జి పద్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మగుంటి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముళ్లపూడి బాబూరావు, అంబేడ్కర్ యువజన, జైభీమ్ యువజన సంఘాలు, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఆలయ రికార్డుల దహనం కేసులో నిందితుల అరెస్టు



ఆలయ రికార్డులను దగ్ధం చేసిన నిందితుల వివరాలు చెబుతున్న డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

నూజివీడు: నూజివీడు మండలం గొల్లపల్లిలోని పురాతన ఆలయం రఘునాథస్వామి ఆలయంలోని రికార్డులను దహనం చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను నూజివీడు డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల వద్ద వెల్లడించారు. ఈనెల 22న అర్ధరాత్రి సమయంలో ఆలయ ఈఓ కార్యాలయంలోకి దుండగులు చొరబడి రికార్డులను దహనం చేయడంతోపాటు, కంప్యూటర్‌ను ధ్వంసం చేశారని తెలిపారు. దీనిపై ఈనెల 23న ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ కేసు నమోదు చేశారని, ఆలయంలోని సీసీ కెమేరాలను పరిశీలించగా టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ యలర్తి ప్రభాకర్, మరికొందరు కలిసి ధ్వంసం చేసినట్టు దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామం నుంచి పరారైన యలర్తి ప్రభాకర్‌ను అతని అనుచరులైన టీడీపీ కార్యకర్తలు మిరియాల నవీన్, దోనేటి చిన్నయేసులను బుధవారం సీఐ రాజులపాటి అంకబాబు నేతృత్వంలో ఎస్సై రామకృష్ణ గొల్లపల్లి శివారులో అదుపులోకి తీసుకొన్నట్టు తెలిపారు. ఈ ముగ్గుర్నీ విచారించగా ఈనెల 21న టెండర్లను తెరిచే సమయంలో ఈఓకు ప్రభాకర్‌కు గొడవ జరగగా, ఈఓ తనను నలుగురితో అవమానకరంగా మాట్లాడడంతో రికార్డులను దహనం చేసినట్టు తేలిందన్నారు. ఏ1గా యలర్తి ప్రభాకర్, ఏ2 గా మిరియాల నవీన్, ఏ3గా దోనేటి చిన్నయేసులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని చెప్పారు. రూరల్ సీఐ అంకబాబు, ఎస్సై తలారి రామకృష్ణ పాల్గొన్నారు.

సారా స్వాధీనం : వ్యక్తి అరెస్ట్

టి.నరసాపురం: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం సమీపంలో తనిఖీలు చేస్తుండగా పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన లింగం మురళిని అరెస్ట్ చేసి, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితుడిని చింతలపూడి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.



సారా నిందితుడిని పట్టుకున్న టి.నరసాపురం పోలీసులు

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యం



ఏలూరు టౌన్: ఏలూరు 24వ డివిజన్‌లో మహిళలకు అందిన పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్



పెదపాడు : పెదపాడు మండలం కలపర్రులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

కుప్పకూలిన వంతెన



కూలిన దేవరం వంతెన, ఇరుక్కుపోయిన లారీ

ముదినేపల్లి రూరల్ : ముదినేపల్లి శివారు అన్నవరం నుంచి దేవరం వెళ్లే మార్గంలో ఉన్న వంతెన బుధవారం కుప్పకూలింది. ఉదయం చేపపిల్లల లోడు లారీ వెలుతుండగా వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. వ్యాను వంతెనలో కూరుకుపోయింది. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు సైతం అవకాశం లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని కాకరవాడ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత బేతపూడి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెనను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ముదినేపల్లి మండలం దేవరం కాకరవాడ, గుడ్లవల్లేరు, చినగొన్నూరు, పురిటిపాడు గ్రామాలకు వెళ్లేందుకు 70 ఏళ్ల క్రితం అన్నవరం సమీపంలోని డ్రెయిన్‌పై నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. సమస్యను స్థానికులు అధికారులకు పలుమార్లు తెలియజేశారు. గత శనివారం ఈ వంతెనపై భారీ వాహనం వెళుతుండగా పాక్షికంగా కుంగిపోయింది. భారీ వాహనాలకు ప్రవేశంలేదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు ముందస్తు చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

లాభసాటి వ్యవసాయానికి కృషి

పెనుమంట్ర: రైతుకు లాభసాటి వ్యవసాయం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ వి.విజయాభినందన అన్నారు. బుధవారం మార్టేరులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహించిన కిసాన్‌మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా పరిశోధనలు చేయడమే ప్రథమ కర్తవ్యమన్నారు. మార్టేరులోని పరిశోధనా స్థానంలో సృష్టించిన వరి వంగడాలు దేశ విదేశాలకు వెళ్లి మంచి పేరు తెచ్చుకోవడమే కాకుండా, రైతులకు ఆర్థిక పరిపుష్టిని అందించాయన్నారు. జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి మాట్లాడారు. సర్పంచ్‌లు ఎం.ధనలక్ష్మి, మట్టా కుమారి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడిని తాకిన సూర్యకిరణాలు







సూర్యకిరణాల కాంతుల నడుమ దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీనివాసుడు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు

ద్వారకాతిరుమల: సూర్యాస్తమయ సమయాన భానుడి కిరణాలు శ్రీనివాసుడిని బుధవారం అపాదమస్తకం తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించిన భక్తులు పరవశించారు. ప్రతి ఏటా చైత్ర మాసంలో కనిపించే ఈ అరుదైన ఘట్టం శ్రీవారి క్షేత్ర ఉపాలయంగా విరాజిల్లుతోన్న లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వర స్వామి పురాతన ఆలయంలో ఆవిష్కృతమయ్యాయి. సూర్యకిరణాలు నేరుగా స్వామి, అమ్మవార్లను తాకడం ఒక విశిష్టత. ఎంతో లోపలికి ఉండే ఈ ఆలయ గర్భాలయంలోకి సూర్యకిరణాలు నేరుగా ప్రవేశించి శ్రీవారిని అనువణువునా అర్చిస్తాయి. ఏటా చైత్ర మాసంలో వరుసగా మూడు రోజులు సాయంత్రం సూర్యాస్తమయ సమయాన అద్భుత కాంతులతో సూర్యకిరణాలు నేరుగా ఆలయంలోకి ప్రవేశించి వేంకటేశ్వర స్వామివారి ముఖం మీద నుంచి నెమ్మదిగా క్రిందకు దిగుతూ పాదాల వరకు అర్చిస్తాయి. స్వామివారి పాదాల వద్ద ఉన్న ఉత్సవ మూర్తులను తాకుతాయి. అనంతరం సూర్యకిరణం రెండుగా చీలి ఇరుపక్కలా ఉన్న పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఆలయంలోకి ప్రవేశించి అమ్మవార్లను అర్చిస్తాయి. ఈ కిరణాలను చూసేందుకు భక్తులు ఆలయానికి తరలివస్తారు. గురువారం కూడా ఈ సూర్యకిరణాలు పడే అవకాశం ఉందని ఆలయ అర్చకులు గోపీ తెలిపారు.